# నాకీ డబ్బొద్దు

"టెలిగ్రామ్" అన్నకేకకి గుండెకొట్టు కోవడం ఆగిపోయినట్లయింది వసుధకి. నెమ్మదిగా లేచివెళ్ళి వణుకుతున్న చేతులతో సంతకం చేసి చింపి చదివిన వసుధ కుప్పలా కూలబడిపోయింది. మరి కాస్సేపటికి దుఃఖం తన్నుకొచ్చి గట్టుతెగిన కాలువలా కన్నీరు కారసాగింది.

ఆమె గోల విన్న నితిన్ లోపలినుంచి పరిగెత్తుకొచ్చి వసుధచేతిలోని టెలిగ్రామ్ తీసుకుని చదివి క్షణంసేపు అచేతనంగా నిలబడిపోయి, మరి కాస్సేపటికి తేరుకుని గోలగోల పెడుతున్న వసుధ పక్కన కూర్చుని చెప్తున్న ఊరడింపు మాటలు ఆమె దుఃఖాన్ని రెట్టింపు చేస్తున్నాయేగానీ తగ్గించటంలేదు.

కాశీపతి వసుధ పెళ్ళి ఏడాది క్రితమే చేశాడు. నలుగురు ఆడపిల్లల్లో ఆఖరిది వసుధ. బి.కాం. పాసవగానే కొద్దిగా కట్నం ఇచ్చి తమకంటే కాస్త వున్నింట్లోనే ఇచ్చాడు పిల్లని.

కొద్దికట్నంతోటే తృప్తిపడి కాశీపతి ఆఖరి కూతుర్ని తమింటి కోడల్ని చేసుకోడానికి కారణం అరుణాచలంగారబ్బాయి నితిన్‌కి చదువబ్బక పోవడమే! మధ్యతరగతి మనుగడతో నలుగురమ్మాయిలకి డిగ్రీల దాకా చెప్పించి, ముగ్గురికి పెళ్ళిళ్ళు చేసే నాటికే ఆస్తులు కరిగిపోయాయి కాశీపతికి. ఆఖరమ్మాయి పెళ్లి పి.ఎఫ్. లోన్ తీసి చెయ్యక తప్పలేదు.

తనివ్వగల కట్నానికి ఈ సంబంధమే అంగీకరించడంతో, ఏదో కాస్త వున్నింట్లో పడుతోంది కదా పిల్లాడికి డిగ్రీ లేకపోయినా తిండికి లోటుండదనుకున్నాడు. కానీ కాశీపతి అంచనా తప్పని పెళ్ళయ్యాకగానీ తెలీలేదు వారికి.

వసుధ నితిన్‌లని ఆడబిడ్డలిద్దరూ, బావగారూ, తోటికోడలూ కాకుండా ఆఖరికి అత్తగారుకూడా చిన్నచూపే చూసేది.

ఆడబిడ్డలు తమకి వారివల్ల ముద్దుముచ్చట్లేం తీరటంలేదని దెప్పిపోటు

మాటలంటుంటే, తోటి కోడలు తమ పుట్టింటివారు పెట్టే సారె, చీరల్ని చూపించి వెటకారాలు ఆడుతుంటే, అత్తగారు వసుధ పుట్టింటి వారి బీదరికాన్ని ఎత్తిచూపిస్తూ తమ తాహతుకి తగిన పిల్ల కాదని సాధిస్తుంటే వసుధకా యిల్లు ముళ్ళపొదలాగే వుండేది.

భర్తకూడా వసుధ పరిస్థితి తెలిసినా చాటుగా బాధపడేవాడే తప్ప ఎదురుగా ఇంట్లోవాళ్లని ఏమీ అనలేక అక్కడినుంచి వెళ్ళిపోయేవాడు.

అమ్ముకునేవాడు ఎంత బీదవాడైతే కొనేవాడి కంతలోకువన్నట్లుండేది వసుధపరిస్థితి ఆ ఇంట్లో. అందర్నీ ఒకలాగ, వసుధ నితిన్‌లని మాత్రం మరోలాగ ఆదరించేవారంతా.

నితిన్‌కి పట్నంలో రెండువేలరూపాయల ఉద్యోగం వచ్చినప్పుడు వసుధ మనసు కాస్త తేలిక పడింది. సూటీపోటీ మాటలతో ఒళ్ళంతా చిల్లులు పొడిచే ఈ మనుష్యుల మధ్యనుంచి బయటపడి వున్నదాంతో గడుపుగుంటూ, స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకోవచ్చునుకుంది.

ఉద్యోగంలో చేరిన రెండునెలలకే ఆశనిపాతంలా ఈ టెలిగ్రాము. పెళ్ళయి పుట్టింటి గడప దాటివచ్చాక మళ్ళీ వెళ్ళలేదు. అదే ఆఖరి చూపవుతుందనుకోలేదు.

ఇప్పుడు వెంటనే బయలుదేరి వెళ్లినా మూడో రోజుకి గానీ ఆ ఊరు చేరడం అవదు. విమానం మీద వెళ్తే రెండుగంటల్లో వెళ్ళి కనీసం తండ్రి శవాన్నయినా చూడొచ్చు. కానీ అంత డబ్బేదీ? ఒక్కళ్ళు వెళ్ళాలన్నా అయిదారువేల రూపాయలు కావాలి. భర్త దగ్గరంత లేదని తెలుసు.

ఇలా ముందు కర్తవ్యం గురించి ఆలోచన రాగానే దుఃఖాన్ని దిగమింగుకుని భర్తని చూస్తూ "ఏమండీ! పెళ్ళయ్యాక మా నాన్నని మళ్ళీ చూడలేదండీ" అంది.

"నిజమే వసుధా ఇంతలో ఇంత ఘోరం జరుగుతుందనుకోలేదు" అని మౌనంగా వూరుకున్న భర్త వంక చూసి -

"ఏమండీ! ఎవరన్నా అయిదారువేలరూపాయలు అప్పిచ్చి కాస్త సహాయం చెయ్యరా? ఎలాగన్నా తీర్చేద్దాము. మా నాన్న శవాన్నైనా చూస్తాను" అంటూ

ఆరిచేతుల్లో ముఖం దాచుకుని ఏడుస్తున్న వసుధ భుజంమీద చెయ్యేసి -

"వసుధా! ఈ ఊరొచ్చి రెండు నెల్లే అయింది. ఎవరంత డబ్బు నాకిస్తారు?" అన్నాడు.

పరిస్థితి అర్థం చేసుకున్న వసుధ మరేం అనకుండా "స్టేషన్‌కి వెళ్ళి రెండు టిక్కెట్లు బుక్ చేసుకురండి!" అంది.

ఏమీ మాట్లాడకుండా కూర్చున్న భర్తతో "ఏమండీ! తొందరగా వెళ్ళండీ! రాత్రి రైలుకి బయలుదేరితే మూడోరోజుకి చేరుకుంటాం. నేను పెట్లో నాలుగు బట్టలు సర్దుతాను" అంటున్న వసుధవైపు చూస్తూ -

"వసుధా! టిక్కెట్లకి డబ్బులూ..." అంటూ నాన్చసాగాడు.

నిజమే భర్తకి అసలు బ్యాంక్ అకౌంటే లేదు. వచ్చే రెండువేలల్లో వెయ్యిరూపాయలకి ఓ మారు మూల పాడుపడ్డ ఇంట్లో ఓ గదిలో వుంటూ మిగతా వెయ్యితో నెలంతా గడుపుకుంటున్న తమకి బ్యాంక్ అకౌంటెక్కడినుంచి వస్తుంది?

లేచివెళ్ళి తన పెట్టె తెరిచింది. అత్తవారింటికొచ్చేటప్పుడు తండ్రి తన చేతికిచ్చిన నాలుగొందల రూపాయలతో పాటు పెళ్ళిలో బంధుమిత్రులిచ్చిన డబ్బుకూడా ఓ ఆరువందలదాకా వుంది. ఆ డబ్బు లోంచి ఇద్దరి టిక్కెట్లకీ ఇచ్చి మిగతాది ప్రయాణ ఖర్చులకి సరిపోతుందనుకుంది.

తిరిగొచ్చిన వసుధని తండ్రి మరణం చాలా కృంగదియ్యసాగింది. ముఖ్యంగా ఎన్నడూ తల్లి దండ్రులకి దూరంగా లేనిది పెళ్ళయి ఒక్కసారిగా ఇంత దూరం వచ్చెయ్యడం, దానికి తోడు పోయిన తండ్రి శవాన్నయినా చూడలేకపోవడం ఒక షాక్‌లా తగిలి, చాలా బాధించసాగింది.

ఒంటరిగా కూర్చుని ఆలోచిస్తున్న వసుధ బుర్రలో ఒకటే ఆలోచన.

ప్రపంచంలో అన్నింటికన్నా ముఖ్యమైనది, విలువైనది డబ్బు. అది వున్న వ్యక్తి అన్నీ కొనగలడు. దేశంలో, అయినవాళ్ళలో గౌరవం, పరపతి, పేరు ప్రఖ్యాతుల్ని కూడా డబ్బుతోనే కొనెయ్యవచ్చు. అది లేనివారి బ్రతుకు వ్యర్థం. వారి బ్రతుకులు తమ బ్రతుకుల్లాగే వుంటాయి.

అత్తవారింట్లో తనకి, తన భర్తకి కనీస గౌరవం, అప్యాయత లేకపోవటం

మాట అలా వుంచి, చులకనగా చూడటానికి కారణం నితిన్‌కి పెద్ద ఉద్యోగం లేకపోవడమే. జన్మనిచ్చిన తండ్రి శవాన్నయినా చూసుకోలేకపోవడానికి కారణం ఈ డబ్బే!

ఇలా మనిషికీ డబ్బుకీ వున్నలంకె, బాంధవ్యాన్ని గురించి ఆలోచించుకుంటోంటే ఎన్నో నిజాలు కళ్ళముందు మెదలసాగాయి. దాంతో మనసులో ఏదో ఆలోచన మెదలసాగింది.

క్షణక్షణానికి ఆ ఆలోచనకి ఉగ్గుపాలు పోసి పెంచసాగింది. ఒక నిర్ణయానికి వచ్చినదానిలా గతం తల్చుకుని బాధపడటం మాని భవిష్యత్‌కి కొత్త పునాదులు తవ్వసాగింది.

తండ్రి పోయాక వచ్చిన ఆయన ఎల్.ఐ.సి. డబ్బులో ఓ పదివేల రూపాయలు తల్లి వసుధకిచ్చింది. ఆ డబ్బుని బ్యాంక్‌లో వేసుకుని కంప్యూటర్ కోర్సులో చేరింది. పక్కన పిల్లలకి ట్యూషన్లు చెప్తూ పైగా కూడా గడించుకోసాగింది.

ఇలా రెండేళ్ళపాటు కంప్యూటర్‌కోర్సు చేసి ఓ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగంలో చేరింది. కొన్నేళ్ళ సర్వీసు తరవాత కరస్పాండెన్స్ కోర్స్ ఎం.సి.ఎ.కి ఎంట్రన్సు రాసి అందులో పాసయి అదీ చెయ్యసాగింది. అదీ పూర్తికాగానే మల్టీనేషనల్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది.

మనసులో ప్లాన్ చేసుకున్న ప్రకారం ఈ మధ్య కాలంలో నిరాడంబరంగా గడుపుకుంటూ, ఇంటి కొచ్చిన బంధుమిత్రులకి మర్యాదలు చేస్తూ మెట్టు మెట్టూ ఎక్కుతున్నట్లు, తాను అనుకున్న ప్రకారం ముందడుగు వేస్తూ కోరుకున్నవన్నీ సాధించి జీవిత గమనాన్నే మార్చుకుంది.

డబ్బులు కూర్చి ముందుగా ఓ ఫ్లాట్ ఇన్‌స్టాల్ మెంట్ మీద కొంది. అందులో టీ.వి., ఫ్రిజ్ దగ్గర నుంచి అన్నీ కొని అమర్చింది. ఈరోజు వసుధ ఇంట్లో లేని సామాను లేదు.

నెల గడపటం కష్టమైన రోజున భర్తని ఎలా ఆదరించిందో, ఒక్క రెక్కమీద అన్నీ కూర్చుకున్నా, భర్తకన్నా తనెక్కువ గడించుకుంటోన్నా కూడా భర్తకి అదే గౌరవం, మర్యాద ఇచ్చిందేగానీ అహంకారంతో తూలనాడలేదు.

కంప్యూటర్ వర్క్‌లో మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకుని మంచి అనుభవం గడించిన వసుధ ఇంట్లోనే రెండు మూడు కంప్యూటర్లని కొని నితిన్‌కి కూడా నెమ్మదిగా నేర్పించి, కొందర్ని సహాయానికి పెట్టి తనకున్న కంటాక్టులవల్ల అతనిచేత ప్రోగ్రాములు తయారుచేయించసాగింది.

వసుధ పట్టుదల, ప్లానింగ్‌వల్ల ఇంట్లో వచ్చిన మార్పుల్ని చూసిన నితిన్ కూడా కష్టపడి పని నేర్చుకోసాగాడు. అదలా మూడు పువ్వులూ ఆరు కాయల్లా ఎదిగి చిన్న ఆఫీసల్లా పెద్దయింది.

వేరే పెద్దిల్లు కొని అందులోకి తాము మారి ఈ ఫ్లాట్‌లో బిజినెస్ చెయ్యసాగారు. భర్తమీదుండే అభిమానం, గౌరవంతో సంపాదనంతా తనదైనా నితిన్ పేరనే వ్యాపారం, ఇళ్ళు పెట్టింది.

ఒకనాడు గట్టిగా రెండు జతల బట్టలైనా లేని నితిన్ ఈనాడు సూట్లు, టై, బూట్లతో జన్ కారులో తిరగడం, పెద్ద పెద్ద వ్యాపారస్తులు, పేరున్న కంపెనీల వారూ నితిన్‌తో డీల్ చెయ్యడం వసుధకి ఆనందంగానే కాకుండా గర్వంగా కూడా వుండేది. వసుధ ఇప్పుడు ఉద్యోగం మానేసి తన కంపెనీలోనే భర్తతో కలసి పనిచెయ్యసాగింది.

నితిన్ జీవితంలో మార్పు చూసిన అక్కచెల్లెళ్ళలో చాలా మార్పు వచ్చింధి. ఇప్పుడు ఆప్యాయత లొలకబోస్తూ ఇంటికి రాసాగారు.

ఒకనాడు తమింటికి రమ్మని పిలిస్తే 'మీ ఇల్లు సందుల్లోనమ్మా!' అని ఒకరంటే, 'ఇరుక్కొంపమ్మా! గాలి ఆడదు' అని మరొకరంటే, వచ్చి వెళ్ళేటప్పుడు సారె, చీరలు గొప్పగా పెట్టలేని వీరిని 'పెద్దాడింటికి వెళ్తే అంత ఖరీదైన చీరెట్టారమ్మా!' అని మరొకరు అన్నవారే ఈనాడు పిలవకుండానే వచ్చి పాత విషయాలు మర్చిపోయి, ఏమీ జరగనట్లే ప్రవర్తించేవారు నితిన్‌తో.

వసుధ అనాడు తనని కించపరిచారన్న విషయాన్ని మనసులో పెట్టుకోకుండా తన శక్తికొద్దీ వారికి అన్నీ చేసి పంపేది.

నితిన్ జీవితంలో ఈ మార్పు ఎవరివల్ల వచ్చిందో ఎలా వచ్చిందో తెలిసినా ఆడబిడ్డలు గానీ అత్తమామలుగానీ వసుధని ఒక్కనాడు మాట మాత్రంగానన్నా మెచ్చుకునేవారు కాదు. పైగా ఇదంతా నితిన్ తెలివితేటల వల్లే అని పొగుడుతూ -

'నీ జాతకంలో ఎంత మార్పొచ్చిందే తల్లీ! ఏనాడన్నా కారులో తిరిగి సొంతింట్లో వుంటానని ఊహించుకున్నావా? మీ అక్కలలాగే వుండవలసిన నీకు మావాడివల్ల ఎంత సిరి ఎత్తింది తల్లీ!' అని వెటకారాలాడుతుంటే కనీసం భర్తన్నా ఒక్కసారి నిజాన్ని తనవారికి చెప్తే బాగుండుననుకున్న ఆమెకి నిరాశే ఎదురయ్యేది.

ఇలా ఆనాడూ ఈనాడూ కూడా తనపట్ల వారిలో ఏవిధమైన మార్పూ కనపడలేదు.

అత్తవారి తరపువాళ్ళంతా ఇంట్లో అధికారమంతా తమదే అన్నట్లు తమకి కావలసినవన్నీ దబాయించి మరీ చేయించుకునేవారు.

వారి ప్రవర్తనని భర్తన్నా కాస్త అదుపులో పెడితే బాగుండుననుకునేది. కానీ అటువంటిదేమీ సూచన ప్రాయంగా కూడా అతనిలో కనపడేది కాదు. ఇదివరలో అత్తవారంతా తనని హేళనగా మాట్లాడుతుంటే ఏమీ అనకుండా ఊరుకునేవాడు.

ఇప్పుడు వారితో కలిసి నితిన్ కూడా వెటకారాలు ఆడటం మొదట్లో కాస్త ఆశ్చర్యమనిపించింది. అది అలా ఎక్కువే అవసాగింది.

వారాడే మాటలకి నితిన్ వంతపాడుతుంటే వసుధ పరిస్థితి అయోమయంగా వుండేది. ఇది వరలో ప్రతీదానికీ తన సలహా అడిగి, సంప్రదించే నితిన్ ఇప్పుడు తనని లక్ష్యపెట్టడం మానేసి తనకి నచ్చినట్లు, తోచినట్లు నిర్ణయాలు తీసుకుంటూ, ఆమెతో అవసరమున్న వాటి విషయమే ఆమెకి చెప్పడం, మాట్లాడటం చెయ్యసాగాడు.

బిజినెస్‌లో వచ్చే డబ్బు వ్యవహారమంతా తనే చూసుకోసాగాడు. తన ప్రమేయం లేకుండా మాట మాత్రంగానైనా చెప్పకుండా తనకి నచ్చిన వారికి వేలకివేలు ఖర్చుపెట్టడం, అప్పులు ఇవ్వడం ప్రారంభించాడు. ఇన్నేళ్ళు కష్టపడి ఇంత కూర్చి, చేర్చిన వసుధ చేతిలో పైసలే కరువయ్యాయి.

'అన్నయ్యా! కూతురి పెళ్ళిరా ఓ లక్షరూపాయలు కావాలిరా!' అంటూ చెల్లెలు, 'ఒరేయి తమ్ముడూ! ఫ్లాట్ కొందామనుకుంటున్నానురా. ఓ రెండులక్షలు అప్పివ్వరా' అంటూ అన్నగారూ రాసే ఉత్తరాలకి వెంటవెంటనే డి.డిలు వెళ్తుంటే -

'ఒక్కమాటగా నాకు చెప్తే నేను మాత్రం వద్దంటానా? అయినవాళ్ళని అవసరాలప్పుడు ఆదుకోడంలో తప్పులేదు. సొంతవాళ్ళు ఒకరికొకరు సాయం చేసుకోకపోతే ఎవరు చేస్తారు? కానీ ఈ విషయాలు భార్యతో చెప్పడం నామోషీ పరువు తక్కువనా? లేక చెప్పకూడని విషయమా?' అని వసుధ బాధపడేది.

ఇలా రోజురోజుకీ అతని ప్రవర్తనలో వస్తున్న మార్పుతోపాటు వసుధపట్ల నిర్లక్ష్యం కూడా పెరగసాగింది. ఇప్పుడు నితిన్‌కూడా వసుధ తన తాహతుకి తగని భార్య అన్నట్లు మాట్లాడటం, బీదింటి పిల్లని, అత్తవారు లేనివారని హేళన చెయ్యడం వసుధని చాలా నొప్పించసాగింది.

'ఈరోజు తన జీవితంలో వచ్చిన మార్పుకి కారకులెవరు? పాతికేళ్ళక్రితం తన స్థితి ఏమిటి?' అని ఒక్కసారి ఆలోచించుకోడంతోపాటు, తనని మొదట్లో సొంతవాళ్ళు ఎంత ఆదరించి, గౌరవించారన్నది ఒక్కసారి గుర్తుతెచ్చుకుంటే బాగుండుననుకునేది. కానీ భర్తకవేం గుర్తున్నట్లులేవు. పుట్టినప్పటి నుంచి కారులోనే తిరుగుతున్నట్లు తన దగ్గరే ఆడే మాటలు విని షాకయిపోయేది.

ఈ బిజినెస్‌లో ఆరితేరిన నితిన్ వసుధని ఇంక ఆఫీసుపనిలోకి రావద్దని, ఇంట్లో పనులు చూసుకోమని ఆదేశించాడు. క్షణక్షణానికీ భర్తలో వస్తోన్న మార్పుతోపాటు తన పట్ల పెంచుకుంటోన్న అసూయాద్వేషాలని భరించలేకపోయేది.

ఒకసారి వసుధ తల్లి చూడటానికి కూతురింటికి వచ్చింది. నితిన్ అత్తగారిని కనీసం పలకరించకపోగా చాలా హీనంగా చూసి, కనీస మర్యాదైనా చెయ్యకపోవడంతోపాటు తన తాహతుకి తగని వ్యక్తి తనింటికి రావటం చిన్నతనమన్నట్లు మాట్లాడుతుంటే వసుధ మనసు కోపంతో కుతకుత లాడిపోయింది. తన తరపు వాళ్ళొస్తే పట్టుచీరలు తెచ్చిపెట్టమనే భర్త తన తల్లికి ఓ నేతచీర కొని తేవడంతో మనసు భగ్గున మండిపోయింది.

ఇలాప్రతీ విషయంలోనూ నీవాళ్ళూ నావాళ్ళూ అన్న తేడాని చూపిస్తూ ప్రవర్తిస్తున్న భర్తపట్ల ఆప్యాయత తొలగి అసహ్యం చోటుచేసుకుంది. ఈ తేడాకి కారణమేమిటని నిలదీసి అడిగితే -

"తాహతుని బట్టి మనుష్యులకి పెట్టుపోతలుంటాయి" అని నిర్భయంగా

భర్తిచ్చిన సమాధానానికి ఆమె మనసు భగ్గున మండింది.

కష్టాల్లో వుండి సరైన తిండికూడా లేని స్థితిలో దగ్గరకి రానివ్వనివారిపట్ల ఈనాడింత ప్రేమ కురిపించడానికి రక్తసంబంధం ఒక్కటే కారణమైతే, పెళ్ళయిన నాటినుంచి తనతో బీదరికాన్నే కాదు కష్టసుఖాల్ని కూడా పంచుకుని తన్నీ స్థితికి తీసుకొచ్చిన సహధర్మచారిణికి తను చేస్తున్న న్యాయం ఏమిటి? తనకి రోగమొస్తే పాతికరూపాయలు ఖర్చుపెట్టలేని భర్త తనవైపు వాళ్ళకి రోగాలొస్తే ఈనాడు వేలకి వేలు ఖర్చుచేసి వైద్యాలు చేయిస్తున్నాడంటే ఎవరివల్ల?

ఒకనాడు నా తండ్రి పోతే రైలు టిక్కెట్టన్నా కొనివ్వలేని నితిన్, తన తండ్రి పోయినప్పుడు విమానంలో గంటలో వెళ్లి తండ్రికి అన్నీ చేశాడంటే కారణం ఎవరు? ఎవరి డబ్బుతో ఈ జల్సాలకి, తనవాళ్ళ అవసరాలకి ఖర్చుపెడుతున్నాడు? ఇవన్నీ ఎలా మర్చిపోయాడు!

ఒకానొక రోజు రూపాయికి తన దగ్గర చెయ్యి జాపిన నితిన్ ఇప్పుడు తన చేతికి పదిపైసలివ్వడానికి ముఖం చూసుకుంటున్నాడు. నడమంత్రపు సిరి అంటారు దీన్నేనా? ఈ సిరి మనిషిని ఇంత తలబిరుసు వ్యక్తిగా మార్చేస్తుందా?

తనని నిర్లక్ష్యం చేసినవారంతా ఈనాడు ఆత్మీయులైపోయారు. శరీరంలోని చీము, రక్తం ధారపోసి నా మనసులోని కోరికల్ని చంపుకుని, నాకంటూ చూసుకోకుండా ఓ ముద్దూముచ్చటన్నా తీర్చుకోకుండా ఇంతటివాడిని చేసిన భార్యపట్ల ఇంత అహంకారంతో ప్రవర్తించడమా?

ఛీ-డబ్బింత పాపిష్టిదా? డబ్బు చాలని రోజుల్లో వున్నదాంతో చాలీ చాలక గడుపుకుంటున్నప్పుడు నా పట్ల భర్తకున్న అనురాగం, ఆప్యాయత ఏమయ్యాయి? ఆ రోజుల్ని తల్చుకుంటే మళ్ళీ ఆ రోజులు తిరిగొచ్చేస్తే ఎంత బాగుండునో అనిపిస్తోంది. ఛీ-ఈ డబ్బు వద్దు పాతరోజులే కావాలి అనుకుంది వసుధ.

రాత్రి పదకొండు దాటింది. ఫోన్‌రింగవుతోంది. నితిన్ పక్కనేవున్న కార్డ్‌లెస్ ఫోన్ అందుకున్నాడు. అతని జవాబుని బట్టి ఏదో ఆందోళనకరమైన వార్తే అని అర్థమై "ఏమైందండీ?" అంది ఆదుర్దాగా లేచికూర్చుంటూ.

"మీ అమ్మగారు పోయారుట" అన్నాడు ఫోన్ అందిస్తూ చాలా

సహజంగా.

ఫోన్ అందుకున్న వసుధకి నోటమాట రావటంలేదు. కళ్ళంటనీళ్ళు తప్ప.

ఫోన్‌పెట్టేసిన వసుధని నితిన్ మాటవరసకన్నట్లు "పాపం పోయారన్నమాట- ఏమొచ్చింది?" అన్న దానికి బాధపడుతూనే చెప్పింది.

తల్లిపోయిన వెంటనే బావగారు చేసిన ఫోన్‌కాల్ అది. శవాన్నెలాగూ రాత్రి తీసుకెళ్ళరు. ఉదయమే ఆరుగంటల ఫ్లయిట్‌కి వెళ్తే శవాన్ని చూడొచ్చు. తండ్రి శవాన్ని చూడాలని మనసు పీకినా డబ్బులేక వెళ్ళి చూడలేకపోయింది. ఇప్పుడా సమస్య లేదు. ఏదన్నా దొరుకుతుంది కానీ తల్లిదండ్రుల ప్రేమాభిమానాలెక్కడా దొరకవు.

కని పెంచి, పెళ్ళిళ్ళు చేసి అత్తవారిళ్ళకి పంపినా బ్రతికున్నన్నాళ్ళూ ఆడపిల్లలకోసం పాటుపడేవాళ్ళు తల్లిదండ్రులే-అనుకుంది.

"ఎప్పుడు బయలుదేరతావు?" అని ఏకవచనం ఉపయోగించిన భర్త మాటలకి "రేపు ఉదయమే ఆరుగంటల ఫ్లయిట్‌కి వెళ్తున్నాను" అంది భర్తవైపు చూస్తూ.

కొంచెం షాక్‌తిన్నట్లు చూసి "పెద్దావిడ అన్నీ అనుభవించారు. శుభకార్యాలన్నీ చేసేసుకున్నారు. పిల్లలచేతిలో హాయిగా ప్రాణం విడిచేశారు. అదృష్టవంతురాలు" అన్నాడు నితిన్.

ఈ ఉపోద్ఘాతం ఎందుకో, ఒక్కసారిగా ఈ ప్రేమ దేనికో అర్థంకాక భర్తకేసి చూసింది.

నితిన్ దగ్గరగా వస్తూ- "చూడు వసూ! పోయినామె పోయారు. దహన సంస్కారాలు మీ పెద్దబావగారెలాగూ వుండి చూసుకుంటారు. నువ్వు ప్లేన్‌లో వెళ్ళినా, రైల్లో వెళ్ళినా ఆమె తిరిగిరారు. ప్లేనైతే అయిదారువేలు ఖర్చు. రేపు సాయంకాలం రైలు కెళ్ళు" అన్నాడు.

అతని మాటలకి దెబ్బతిన్న పులిలా లేచి నిలబడింది వసుధ. గుండెలో నిప్పులు పోసినట్లు మండిపోసాగింది. కళ్ళంట నిప్పుకణాలు రాలుతున్నాయా? అన్నట్లున్నాయామె చూపులు ఏదో అనాలని పెదాలు అదరసాగాయి.

మళ్లీ ఆవేశానికిది సమయం కాదనుకుని తన్నుతాను సముదాయించుకుంది. కాస్సేపు ఊరుకుని తీక్షణంగా భర్తవైపు చూస్తూ అంది-

"మా నాన్న పోయిన తరవాత మా అమ్మ నా కిచ్చిన పదివేల రూపాయలే మన జీవితాలనింతలా మార్చేశాయన్న విషయాన్ని మీరు మర్చిపోయినా నేను మర్చిపోను. అంతకుముందు పైసా పైసా లెఖ్ఖపెట్టి గడుపుకున్న రోజులు మర్చిపోకూడదు.

మీరు చాలా మారిపోయారు. పాత జీవితాన్ని మీరు మర్చిపోయారు. ఈనాడు నా తల్లి మీ తాహతుకి తగని వ్యక్తికానీ నాకు తల్లి. నా తల్లికోసం నేను వెళ్లితీరతాను.

నా తల్లి దయవల్లే ఎద్దుబండెక్కే మీ బ్రతుకీ నాడు విమానాల్లో ప్రయాణిస్తోంది. మీ వాళ్లందరి అవసరాలనీ తీరుస్తోంది. ఇంత చేసిన నా తల్లి శవాన్ని చూడటం మీకు నామోషీ కావచ్చు. అంత ముఖ్యం కూడా కాకపోవచ్చు. కానీ నాకు చాలా ముఖ్యం. డబ్బులేనివాళ్ళకో పద్ధతి, డబ్బున్నవాళ్ళకో రీతి ఈ లోకంలో వుండదు.

తల్లివిలువ మీకూ నాకూ సమానమే. బిడ్డల్ని బీద తల్లీ, గొప్ప తల్లీ ఒకేలా పెంచుతుందన్న విషయం తెలుసుకోండి. ఈనాటి మీ ఈ స్థితి చూసుకుని గతాన్ని మర్చిపోతున్నారు. ఎవరు చేసిన మేలన్నా ఎప్పుడూ మర్చిపోకూడదు.

మీరిచ్చినా ఇవ్వకపోయినా ఎక్కడన్నా అప్పన్నా చేసుకునైనా నేను వెళ్తున్నాను" అంటూ విసురుగా లేచి బీరువా తెరిచి బట్టలు తీసుకుంటోన్న వసుధ దగ్గరకొచ్చి విసురుగా ఆమెజబ్బపట్టుకుని లాగి-

"ఏమిటే వాగుతున్నావు? మీ అమ్మిచ్చిన బోడి పదివేలూ పిల్లల్ని పెట్టి నన్ను కోటీశ్వరుడిని చేసిందా? ఏమిటి?! నీవల్ల నీ వాళ్ళవల్ల నా బ్రతుకు మారిపోయిందా? నోటికొచ్చినట్లు పేలుతున్నావు- నువ్వేం చేసేశావు? నీ వాళ్లేం పెట్టేశారు??" అంటూ ఎగురుతున్న భర్తవైపు ఛీత్కారంగా చూస్తూ అనుకుంది వసుధ-

"ఈయనమాత్రం ఆ కుటుంబంలోంచి వచ్చిన మనిషి కాదా? ఆనాడు లేనప్పుడు చచ్చిన పాములా పడుండి, తనవాళ్ళు చూసే చిన్నచూపులకి,

ఆడేమాటలకి చాటుగా తన దగ్గర బాధపడే వ్యక్తేనా? అదలా వుండగా ఆ అవహేళన చేసిన వారినందర్నీ నెత్తినెట్టుకుంటూ, తనకి మేలుచేసి ఈస్థితికి తీసుకొచ్చినవారినే 'నువ్వేం చేశావు' అని అడుగుతుంటే ఏం చెప్పాలీ మనిషికి!

భగవాన్! ఒకానొకనాడు డబ్బే సర్వస్వం అనుకున్నాను. కానీ ఈనాడు ఈ పాపిష్ఠి డబ్బే అన్ని అనర్థాలకీ కారణం అనుకుంటున్నాను. ఆప్యాయతల్ని డబ్బుతో కొలిచే ఈ డబ్బు నాకొద్దు.

ఆప్యాయత, అనురాగం మధ్య నా భర్తతో బ్రతికిన నా పాత బ్రతుకు నాకు మళ్ళీ ప్రసాదించు తండ్రీ!' అనుకుంటూ తల్లిపోయిందన్న దుఃఖం కన్నా భర్త ఆడిన మాటలకి ఎక్కువ బాధపడుతూ 'ఆప్యాయతల్ని చంపే డబ్బు నాకొద్దు. అహంకారాన్ని తెచ్చే ఈ డబ్బు నాకొద్దు. మనశ్శాంతినివ్వని ఈ పాపిష్ఠి డబ్బు నాక్కరలేదు.

నాపాత బ్రతుకు నాకు మళ్ళీ ప్రసాదించి మా భార్యాభర్తల మధ్య అనుబంధాన్ని పెంచు భగవంతుడా!" అంటూ పిచ్చిదానిలా మంచంమీద పడి గుండెల్లో బరువుని దింపుకోడానికి ప్రయత్నించసాగింది వసుధ.

**(మార్చి 1999 స్వాతి)**